ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 24 సెప్టెంబరు 2024

జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నివారణ అధికారిగా రమేష్‌బాబు

శ్రీకాకుళం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కుష్ఠు వ్యాధి, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారిగా డా. బి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులను జారీచేశారు. రమేష్‌బాబు ప్రస్తుతం చిత్తూరు జిల్లా క్షయ నివారణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై శ్రీకాకుళం వస్తున్నారు.

మళ్లీ తుఫాన్

- జిల్లాలో పలుచోట్ల భారీవర్షం
- ఉరుములు, పిడుగుల బీభత్సం

సోమవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)

పలాస	40.0
కోటబొమ్మాళి	30.25
రణస్థలం	29.75
ఇచ్ఛాపురం	29.5
టెక్కలి	29.0
తాళభద్ర(పలాస)	28.0
బూర్జ	27.5
కవిటి	25.25
పైడిభీమవరం	24.75
నందిగాం	24.0
సంతబొమ్మాళి	23.0
లావేరు	18.5
హిరమండలం	14.5
ఆమదాలవలస	12.75
నరసన్నపేట	10.75
పాతపట్నం	10.0

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ నందిగాం/ పలాస రూరల్)

బంగాళాఖాతం సముద్రానికి ఆనుకుని ఉండడంతో తరచూ జిల్లాపై తుఫాన్ల ప్రభావం పడుతోంది. ఈ నెలలోనే రెండు తుఫాన్లు వచ్చాయి. పంటలు నీట మునిగి.. రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. తాజాగా సోమవారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి బలంగా ఈదురుగాలులు బలంగా వీచాయి. పలాసలో అత్యధికంగా 40మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా సుమారు గంటపాటు వర్షం కురవడంతో.. రహదారులపై వరదనీరు ప్రవహించింది.



పలాసరూరల్: సున్నాడలో జోరువాన

- శ్రీకాకుళంలో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండ కాచింది. రెండు గంటల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. శ్రీకాకుళం, గార, ఆమదాలవలస, ఎచ్చెర్ల తదితర మండలాల్లో ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. పలుప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలు.. తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం మండలంలో పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- కోటబొమ్మాళి, రణస్థలం, ఇచ్ఛాపురం, టెక్కలి, బూర్జ, కవిటి, మందస మండలాల్లో భారీ వర్షం కురిసింది. నందిగాంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు కూడళ్లలో జాతీయ రహదారిపై అండర్‌పాసేజీల కింద వాహనాలు నిలిపేశారు. వర్షాల కారణంగా తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లలేదు. వారం రోజుల కిందట తుఫాన్ బీభత్సంతో పంటలు పాడైపోయాయి. ఆ నష్టం నుంచి తేరుకోక ముందే మళ్లీ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందారు.



నందిగాం: భారీ వర్షం కురవడంతో అండర్‌పాసేజీ వద్ద నిలిచిన వాహనదారులు

రక్షించిన చెట్టుకొమ్మ

- జుత్తు చిక్కుకు పోవడంతో బయటపడిన యువతి
- నిలకడగా హరిణిప్రియ ఆరోగ్యం
- రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స

విహారయాత్రకు వెళ్లారు. జలపాతం వద్ద స్నానాలు చేస్తున్నారు. ఒక్కసారిగా నీటిఉధృతి పెరిగింది. ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో జిల్లాకు చెందిన యువతి కూడా ఉంది. కొద్దిదూరం వెళ్లాక ఆమె జుత్తు ఓ చెట్టుకొమ్మకు చిక్కుకుని పోయింది. దీంతో ఆమె ప్రాణాలతో బయటపడింది.

టెక్కలి, సెప్టెంబరు 23: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతంలో చిక్కుకుని.. టెక్కలికి చెందిన చింతాడ హరిణిప్రియ అనే వైద్య విద్యార్థిని అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడింది. ప్రస్తుతం ఆమె రాజమండ్రిలోని యూనివర్సిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. టెక్కలికి చెందిన చింతాడ గణపతిరావు, మాజీ ఎంపీపీ మంజు దంపతుల పెద్ద కుమార్తె హరిణిప్రియ ఏలూరు జిల్లా ఏలూరు ఆశ్రమ్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ కళాశాలకు చెందిన 13మంది విద్యార్థులు ఆదివారం విహారయాత్ర కోసం.. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలోని జలతరంగిణి జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా.. అనుకోకుండా ఒక్కసారిగా పెరిగిన నీటి ఉధృతితో ఐదుగురు విద్యార్థులు గల్లం తయ్యారు. ఆ వరదలో హరిణిప్రియ కూడా సుమారు నాలుగు కిలోమీటర్లు దూరం కొట్టుకుపోయింది. మారేడుమిల్లి సమీపంలో ఓ చెట్టుకొమ్మకు ఆమె జుత్తు చిక్కుకుని ఉండిపోయింది. అప్పటికే గల్లంతైన వారి కోసం గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది వెతుకుతుండగా.. చెట్టు కొమ్మకు జుత్తు చిక్కుకుని ఉన్న హరిణిప్రియ కనిపించింది. ఆమెను రక్షించి.. వెంటనే రంపచోడవరంలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం.. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలో ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె రాజమండ్రిలోని యూనివర్సిల్ చికిత్స పొందుతుండగా.. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు గణపతిరావు, మంజు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



చికిత్స పొందుతున్న హరిణిప్రియ

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా సాయికుమార్



సాయికుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 23: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా ఉరిటి సాయికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన మన్యంజిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిగా పనిచేస్తూ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన పీబీ సాయిశ్రీనివాస్‌ను విజయవాడ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు.

ఆదిత్యాలయానికి రానున్న కొత్త సిబ్బంది

అరసవల్లి, సెప్టెంబరు 23: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానానికి కొత్తసిబ్బంది రానున్నారు. ఆలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు బీఎస్ చక్రవర్తిని విజయనగరంలో మాన్సాస్ ట్రస్టుకు, శ్యామలరావును సింహాచలంలోని శ్రీవరహా లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే సింహాచలం దేవస్థానంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ ఎ.శోభనాద్రాచార్యులతోపాటు విజయనగరం మాన్సాస్ ట్రస్టులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాసరావు.. అదే హోదాలో బదిలీపై అరసవల్లి దేవస్థానానికి రానున్నారు. వీరు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

అమ్మకు ఆపద



- అధికశాతం గర్భిణుల్లో రక్తహీనత
- ప్రతి ఏటా పెరుగుతున్న సంఖ్య
- దీనివల్లే మాతా శిశు మరణాలు
- చిన్నారుల్లోనూ పోషకాహార లోపం
- మారిన జీవనశైలి, ఆహారమే ఇబ్బంది

(హరిపురం)

జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. పౌష్టికాహార లోపంతో మాతాశిశు మరణాల సంఖ్య పెరుగుతోందని పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో అనేక మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రభుత్వం కిశోర బాలికల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నా.. రక్తహీనత కేసులు 30శాతానికిపైగా పెరగడం ఆందోళన కల్గిస్తోంది. మారుతున్న జీవనశైలి, ఆహారంలో పోషకాలు లోపించడంతో రక్తహీనతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పిల్లల ఎత్తు, బరువు వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల పోషణ, పెరుగుదలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైతే వైద్యానికి సిఫారసు చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో 16 సమగ్ర శిశు అభివృద్ధి పథకాలు, 125 సెక్టార్లు నడుస్తున్నాయి. 3,403 ప్రధాన, 650 చిన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరునెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 1,22,164 మంది, 3-6 ఏళ్లలోపు పిల్లలు 69,323 మంది ఉన్నారు. గర్భిణులు సుమారు 22వేల మంది, బాలింతలు 23వేల మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోంది. అలాగే జిల్లాలోని 3,884 ప్రభుత్వ, రెసిడెన్షియల్, ఆశ్రమ తదితర పాఠశాలల్లో 3.98 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనం ద్వారా వారంలో ఐదు రోజులు కోడిగుడ్డును అందిస్తున్నారు. అలాగే జిల్లాలోని పాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు రక్తహీనత బారిన పడకుండా వైద్యారోగ్య శాఖ ఐరన్ మాత్రలు అందిస్తోంది.

- జిల్లాలో 14 ఏళ్లలోపు బాలబాలికలు సుమారు 4.80 లక్షల మంది ఉన్నారు. వారిలో 2.60 లక్షల మంది బాలికలు ఉన్నట్టు అంచనా. 12-14 ఏళ్లలోపు బాలికల్లో సుమారు అరవై శాతం మంది పోషక విలువలు అందక రక్తహీనత బారిన పడుతున్నారు. అలాగే ఏజెన్సీలో ఎక్కువ మంది చిన్నారులు పౌష్టికాహార లోపంతో కొట్టుమిట్టాడుతున్నారని పలు సర్వేలు, అధికారులు హెచ్చరిస్తున్నారు.

రక్తహీనతకు కారణాలివే..

మనం తీసుకునే ఆహారంలో సరైన పోషకాలు లేకపోతే రక్తహీనత ఏర్పడుతుంది. ఆహారంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్-ఎ,సీ, బీ-12 తదితరాలు లోపించడమే ఇందుకు కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. ఫలితంగా కళ్లు లోనికి పోయినట్టు ఉండడం, కొద్దిగా పనిచేసినా నీరసం, నడిస్తే ఆయాసం, శ్వాస సరిగా అందకపోవడం, ఎద భాగంలో నొప్పి వస్తుంది. అలాగే కాళ్లు చేతులు చల్లబడటం, చర్మం కళాహీనంగా తయారుకావడం, ఏ పని చేయాలన్నా ఆసక్తి చూపకపోవడం, మతిమరుపు, మానసిక ఒత్తిడి తదితర లక్షణాలు కనిపిస్తాయి.

ఈ ఆహారం తీసుకుంటే మేలు

నిత్యం బీట్‌రూట్, ఆపిల్, వేరుశనక కాయలు, నల్లనువ్వుల ఉండలు, బెల్లం, బచ్చలికూర, చిక్కుడుగింజలు, బఠాణీలు, ఎండుద్రాక్ష తదితరాలు తీసుకోవడం వల్ల రక్తం పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. బూడిద గుమ్మడికాయ, గోంగూర, గుడ్లు తినడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. గుడ్డులో ఐరన్, పాస్పరస్, జింక్ అధికమొత్తంలో ఉంటాయి. ఐరన్‌తో అలసట, బలహీనత, కోపం దూరం అవుతాయి. జింక్‌తో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బియ్యం, గోధుమలు, ఆలుగడ్డలులో కార్బోహైడ్రేట్లు లభిస్తాయి. వీటి ద్వారా శక్తి ఉత్పన్నమవుతుంది. అలాగే గొర్రెమాంసం, కోడిమాంసం, చేపలు, పాలు, పెరుగు, బీన్స్, సోయా విత్తనాలు తినాలి. కొవ్వు శరీరంలో కండరాలకు శక్తిని ఇస్తాయి. వెన్న, కొబ్బరి, వేరుశనగ నూనె, నెయ్యి, పాలు వంటి వాటిలో విస్తారంగా ప్రోటీన్లు లభిస్తాయి. మనిషి ఆరోగ్యానికి చిరుధాన్యాలు కూడా ఎంతగానో దోహదపడతాయి' అని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

● మందస మండలంలో ఇటీవల ఓ గర్భిణికి నెలల నిండక ముందే పురిటి నొప్పులు రావటంతో హరిపురం ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ప్రసవం చేయించగా.. బాలింతకు తీవ్ర రక్తస్రావం జరిగింది. రక్తహీనత అధికమవడంతో ఆసుపత్రి మాజీ చైర్మన్ పుల్లావాసు ఆధ్వర్యంలో స్థానిక యువత రక్తాన్ని అందించి.. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడారు.

....

● కొన్నాళ్ల కిందట మందస మండలం తీరప్రాంతంలోని ఒక మత్స్యకార గర్భిణికి నెలలు నిండినా పురిటినొప్పులు రాకపోవటంతో హరిపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి గైనకాలజిస్ట్ స్వరాజ్యలక్ష్మి ఆమెను పరిశీలించి రక్తహీనతతోనే ఇలా అయిందని, వైద్యం అందించి పురుడు పోశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.



పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం

అన్ని ప్రాజెక్టుల పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించాలని ఆదేశించాం. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు నెలరోజులపాటు అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపాలు నివారించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం

పాఠశాలల్లో వైద్యాధికారులతో తరచూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. రక్తహీనత బారినపడిన విద్యార్థులకు ఐరన్ మాత్రలు ఇస్తున్నాం. ఈ మాత్రలు ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉంచుతున్నాం.

- డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

చోరీ సొత్తు రికవరీ?

- వ్యాపారుల నుంచి 50 కేజీల వరకు స్వాధీనం

నరసన్నపేట, సెప్టెంబరు 23: జిల్లాలో పలు దేవాలయాల్లో చోరీకి గురైన వెండిని దొంగలు నరసన్నపేటలో విక్రయించినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జేఆర్ పురం సీఐ, ఎస్‌ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నరసన్నపేటలో వ్యాపారుల వద్ద చోరీసొత్తు రికవరీకి చర్యలు చేపట్టారు. కొంతమంది వ్యాపారులను విచారణ చేపట్టి.. చోరుల నుంచి 150 కేజీల వరకు వెండి కొనుగోలు చేయడంపై ఆరా తీశారు. కాగా వెండి ఆభరణాల రూపంలో కాకుండా కరిగించిన కడ్డీలను కొందరు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులకు 50 కేజీల వెండి ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలుస్తోంది. దొంగసొత్తు రికవరీపై పోలీసులు సోదాలు చేస్తున్నారన్న సమాచారంతో బంగారం, వెండి దుకాణాలను వ్యాపారులు మూసివేశారు. వ్యాపారులంతా పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ హడావుడి కనిపించింది. చోరీసొత్తు కొనుగోలు చేసిన వ్యాపారులను ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై నరసన్నపేట పోలీసులు వద్ద ప్రస్తావించగా తమకేమీ సమాచారం లేదని, జేఆర్ పురం పోలీసులు.. దొంగతనం కేసులో రికవరీ కోసం వచ్చారన్నారు. అయితే రికవరీ వివరాలు తెలియవని చెప్పారు. ఎక్కడ చోరీ జరిగినా తమను బలి చేస్తున్నారని నరసన్నపేట వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక.. 'మీ కోసం'లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా, నిర్దీత సమయంలోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, ప్రతీ అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర -2047 గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఉప కలెక్టర్ లక్ష్మణమూర్తి, డీపీవో వేంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వెంకటరామన్, డీఎంహెచ్‌వో మీనాక్షి, ఉద్యానవన అధికారి శ్రీధర్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమస్యలు పరిష్కరిస్తా

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 23: ప్రజలందరి సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. సోమవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలకు సంబంధింత అధికారులతో మాట్లాడి.. త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో సాగునీరు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు చొరవచూపాలని సూచించారు. బదిలీలపై వచ్చే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, స్వర్ణగ్రామాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు




డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న అభ్యర్థులు

కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి

- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అభ్యర్థుల ర్యాలీ

అరసవల్లి, సెప్టెంబరు 23: వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ తక్షణమే చేపట్టాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని గాంధీ పార్కు నుంచి జిల్లాపరిషత్ కార్యాలయం వరకూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత పద్ధతిలోనే హోంగార్డుల రిజర్వేషన్లు కొనసాగించాలని కోరారు. మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చి.. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. 'కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో భాగంగా రెండేళ్ల కిందట 95,208మంది అభ్యర్థులు ప్రాథమిక పరీక్ష రాసి అర్హత సాధించారు. వారికి ఇంతవరకూ దేహదారుడ్య, మెయిన్స్ పరీక్షలు నిర్వహించలేదు. గత ప్రభుత్వం హోంగార్డులకు రిజర్వేషన్లు పెంచడం వల్ల జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. హైకోర్టులో హోంగార్డులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ నేపథ్యంలో జనరల్ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా.. మార్కులతో సంబంధం లేకుండా తీసుకోవాలని సుప్రీంకోర్టులో అప్పీల్ చేశాం. గత ప్రభుత్వం ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయడంతో అభ్యర్థులు నష్టపోయారు. రెండేళ్లుగా ఎంతో వేదనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి. కేసును కొలిక్కి తెచ్చి కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలి. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల'ని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్.శ్రవణ్‌కుమార్, మౌనిక, గణేష్, చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా హరీష్ పాల్గొన్నారు.

నవ్య చిత్రజ్యోతి
శ్రీకాకుళం ● మంగళవారం 24 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com



ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్

'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రశ్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్ర్కీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్ర్కీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్ధంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజీ', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది




'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకుముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.

అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్ర్కిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

ఇన్ ప్రోగ్రెస్

నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్తాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎ స్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

● వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, సెప్టెంబరు 23: పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు సమాజ ఆరోగ్యాన్ని కాపాడే వ్యక్తులని, అటువంటి వారిని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లాలో అన్ని మునిసిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు సేఫ్టీ సామగ్రి సరఫరా చేయాలని ఇప్పటికే కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రికి ఇన్‌గేట్ సౌకర్యం కల్పించాలని ఏపీఎస్ఐడీసీ అధికారులకు, అందుకు అవసరమైన రోడ్డు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ దిలీప్ చక్రవర్తికి సూచించారు. పలువురు పారిశుధ్య కార్మికులకు వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మహరాజ్, డాక్టర్ లక్ష్మణరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ నీలవేణి, నేతలు హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు, లాడి శ్రీనివాస్, దోని బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్యంపై శ్రద్ధ: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లుగా సేవలందిస్తున్న కార్మికులు ప్రతినెలా వైద్యపరీక్షలను చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు గొద్దు చిట్టిబాబు, ఉణ్న రాజశ్రీ, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, కింజరాపు రామారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏవో రమణమూర్తి, కూటమి నేతలు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు

పాతపట్నం: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు గాను వైద్య సేవలు అందిస్తున్నామని సీహెచ్‌సీ వైద్యాధికారి డా.కృష్ణారావు అన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు గుర్తింపునకు ఐడీ నెండర్ కేటాయిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ముందస్తు సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు గిడుతూరి వేణు గోపాలరావు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతా

గొల్లలవలస (పోలాకి): నరసన్నపేట నియోజకవర్గంలో సమస్యలు లేని గ్రామాలను తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం గొల్లలవలసలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించి కరపత్రాలిచ్చి 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు దారుణంగా తయారయ్యాయని, వాటిని పునరుద్ధరించేందుకు నిధులు మంజూరుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, టీడీపీనాయకులు ఎంవీనాయుడు, ఆర్కే నాయుడు, బైరి భాస్కరరావు, జనసేన నాయకులు బలగ ప్రవీణ్, పంచిరెడ్డి సింహాచలం, శ్రీనివాసరావు, తర్ర లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో దేవరావు తదితరులు పాల్గొన్నారు.



పలాస: పురుషోత్తపురం కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

100 రోజుల్లోనే ప్రశాంతంగా పలాస: శిరీష

పలాస: ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ఆస్తుల కు రక్షణ లేకుండా పోయిందని, అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే ప్రశాంత వాతావరణం ఏర్పడిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక పురుషోత్తపురం కాలనీలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారాలు సాగించుకోవచ్చని, వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పలాస-కాశీబుగ్గకు తాగునీటి సమస్య ఉందని, దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నేతలు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర, శాసనపురి మురళీకృష్ణ, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, దడియాల నర్సింహులు, కౌన్సిలర్ అమ్మోజి, అంబటి కృష్ణమూర్తి, డీఈఈ కనకరాజు, డీటీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ప్రగతిబాట: ఎంజీఆర్

హిరమండలం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం ప్రగతిబాట పడుతోందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం గొట్ట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. 100 రోజుల పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలకు నాందిపలికారన్నారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఎంపీడీవో బి.శైలజ, తూలుగు తిరుపతిరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



హిరమండలం: స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

చెత్త తొలగింపు



సంతోషిమాత ఆలయం వద్ద చెత్తను తొలగించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట: వీరన్నాయుడు కాలనీలో సంతోషిమాత ఆలయ సమీపంలో పలు ప్రాంతాల్లో ఉన్న చెత్త కుప్పలకు పంచాయతీ అధికారులు సోమవారం తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'మాటల్లో స్వచ్ఛత.. కానరాని శుభ్రత' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈవో ద్రాక్షాయణి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది పలు వీధుల్లోని చెత్తను తొలగించారు. రోడ్లపై చెత్త వేయవద్దని ప్రజలకు అవగాహన కలిగిస్తామని ఆమె తెలిపారు.

దివ్యాంగులను ఆదుకోండి

జలుమూరు: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించి అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతూ టీడీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు గురుబెల్లి రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులందించాలన్నారు. కుటుంబంతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2016 దివ్యాంగుల చట్టం అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టీడీపీ రాష్ట్ర దివ్యాంగుల కమిటీ సభ్యులు ఊణ్న సాయికుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మాజీ సైనికుల వితరణ

టెక్కలి: వరద బాధితుల సహాయార్థం మాజీ సైనికుల సంఘం టెక్కలి యూనిట్ ప్రతినిధులు రూ.55,181 చెక్‌ను సోమవారం సంఘ ప్రతినిధులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అందించారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అభినందించారు.

చేపల మార్కెట్‌ను ప్రారంభించిన మంత్రి

టెక్కలి: టెక్కలి చిన్నబజారు జంక్షన్‌లో నిర్మించిన చేపల, కాయగూరల మార్కెట్‌ను సోమవారం రాత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అర్హులైన వారికి గతంలో ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసిన వారికి ఈ మార్కెట్ సముదాయం కేటాయించాలని ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుదర్శన్‌దొర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జగ్గమ్మ, డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ, సర్పంచ్ గొండేల సుజాత, నేతలు మామిడి రాము, మెండ దమయంతి, ప్రీతీష్, ప్రసాద్‌రెడ్డి, చిన్నమ నాయుడు, పోలాకి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

కాశీబుగ్గ: వైసీపీ ప్రభుత్వంలో పట్టణాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ తిలక్‌నగర్‌లో రూ.4లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే కాలువ పూడికలు తీసేందుకు రూ.42 లక్షలు మంజూరు చేయించామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను కల్పిస్తామన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొత్తూరు: గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. కుంచాలపేటలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో విమలకుమారి, బాలల హక్కుల సంరక్షణ డైరెక్టర్ కొత్తకోట శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాంతిశ్రీ, సుధారాణి, టీడీపీ నేతలు అగతముడి అరుణ్, నాగళ్ల అప్పన్న, హిరమండలం జడ్పీటీసీ పోగిరి బుచ్చిబాబు, తెలుగు యువత అధ్యక్షుడు చింతాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్‌షిప్‌లో కూర్మారావు ప్రతిభ

టెక్కలి: ఇండోనేషియాలో ఈనెల 17 నుంచి 22 వరకు జరిగిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్‌షిప్ పోటీల్లో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన చాపర పూర్ణారావు సత్తా చాటాడు. ఆదివారం డబుల్స్ విభాగంలో జరిగిన పోటీల్లో ఢిల్లీ క్రీడాకారుడు మున్నాఖలీద్‌తో కలిసి పూర్ణారావు కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పూర్ణారావు అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.



కాంస్య పతక విజేత పూర్ణారావు

లడ్డూ నాణ్యతలో జగన్ అపచారం చేశారు

నరసన్నపేట: కోట్లాది భక్తుల నమ్మకాలను వమ్ము చేసి మాజీ సీఎం జగన్ తిరుపతి లడ్డూ నాణ్యతలో అపచారం చేశారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీని గత ప్రభుత్వం అపవిత్రం చేసిందని విమర్శించారు. తిరుపతి ప్రసాదంలో జంతువుల కొవ్వు పదార్థాలు కలపడం దుర్మార్గమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత పాలకులు చేసిన తప్పిదాలు భక్తుల ఆగ్రహానికి గురికావడం తప్పదన్నారు.

పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు

పాతపట్నం: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్తదీక్షకు మద్దతుగా జనసేన నేతలు స్థానిక శ్రీరామమందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు నక్క క్రాంతికుమార్ మాట్లాడుతూ తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యివాడడం దారుణమన్నారు. వైసీపీ దిగజారుడుతనంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో తలగాపు నవీన్, అప్పరెడ్డి వెంకటలక్ష్మి, జి.రాంబాబు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జనసేన నేతలు

లడ్డూకు కల్తీ నెయ్యి వాడడం దుర్మార్గమైన చర్య

మెళియాపుట్టి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడడం దుర్మార్గమని జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు, టి.ప్రసాద్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మెళియాపుట్టి రాధాగోవింద స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సవలాపురం చంటి, చింతల ప్రశాంత్, డోల క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

విశాఖపట్నం (సిరిపురం), సెప్టెంబరు 23: దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జట్టీ ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈఏడాది రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. అనుమతి ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నది లేనిది పరిశీలించాలని చెప్పారు. అనధికారంగా వ్యాపారాలు చేసే వారిని ముందుగా గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు.

మునిసిపల్ కమిషనర్‌గా రామారావు



పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్‌గా ఎన్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి కమిషనర్‌గా వచ్చారు. గతంలో జిల్లాలో పాలకొండ, ఇచ్ఛాపురం మునిసిపాలిటీల్లోనూ ఈయన పనిచేశారు. ఈ సందర్భంగా రామారావుకు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. పట్టణంలో పారి శుధ్య సమస్యలున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు.

200 మందికి కంటి పరీక్షలు

వజ్రపుకొత్తూరు: చినవంకలో సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 200 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితం గా మందులు పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కంటి శస్త్రచికిత్స అనంతరం మందులతో పాటు కళ్లద్దాలు అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చిన కంటి వ్యాధిగ్రస్తులకు పండ్లు, బిస్కెట్లు, పాలు, అల్పాహారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేత, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేంబాబు చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, తెలుగుయువత మండల అధ్యక్షుడు మరడ దుర్యోధన రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు, టీడీపీ, జనసేన నేతలు బగాది రాజారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

6న ఉద్దానం కిడ్నీ విషాదాలపై పుస్తకావిష్కరణ

పలాసరూరల్: కాశీబుగ్గలో అక్టోబరు 6న 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకావిష్కరణ నిర్వహిస్తున్నట్లు పుస్తక రచయిత, గిడుగు రామమూర్తి తెలుగుభాష కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా ద్రవిడియన్ విశ్వవిద్యాలయం వీసీ, యూపీఎస్సీ మాజీ ఇన్‌చార్జి ఛైర్మన్ ప్రొఫెసర్ కేఎస్ చలం హాజరుకానున్నారన్నారు. సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోండి

పలాసరూరల్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. పలాస, సోంపేట, శ్రీకాకుళంలలో కనీస అర్హత లేని ఉపాధ్యాయులతో కార్పొరేట్ సంస్థలను నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు పవన్ జస్వంత్ ఉన్నారు.

గిరిజన సంక్షేమానికి పాటుపడాలి

హరిపురం: గిరిజన సంక్షేమానికి సంఘాలు పాటుపడాలని గిరిజన అభ్యుదయ సంఘం రాష్ట్ర గౌర వాధ్యక్షుడు సవర నారాయణరావు అన్నారు. కొండలోగాంలో సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమిటీల నేతలు అధికారులకు వినతిపత్రాలను అందజేయాలన్నారు. జిల్లాలో ఐటీడీఏ లేక పోవడం వల్ల గిరిజన గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయన్నారు. మందస ఏటీడబ్ల్యూవో కార్యాలయంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సవర గున్నయ్య, దాసు, రమేష్, నరసింహులు తదిరతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

జలుమూరు: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జలుమూరు కేజీబీవీ నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎ.యశోద తెలిపారు. జిల్లాస్థాయిలో శ్రీకాకుళంలో సోమవారం జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. అండర్-17 విభాగంలో ఎస్.హేమలత, కె.గణేశ్వరి, అండర్-19 విభాగంలో శ్రీవల్లి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ సీరజ, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

కానిస్టేబుల్ రాంబాబుకు ఎస్పీ అభినందన

కొత్తూరు: కొత్తూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లోతుగెడ్డ రాంబాబుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం అభినందించారు. ఈనెల 14న జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 32 కేసులను రాజీ చేసేందుకు కృషి చేసినందుకు గాను ప్రశంసాపత్రం అందించారు. రాంబాబును సిబ్బంది అభినందించారు.



రాంబాబుకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

చంద్రమ్మ ఆశయాలు నెరవేర్చాలి



పలాసలో నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



హరిపురం: రట్టిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

పలాస/హరిపురం: తాను నమ్మిన సిద్ధాంతాల కోసం విప్లవ పంథాను ఎంచుకుని చంద్రమ్మ చివరి వరకు రాజీలేని పోరాటాలను చేశారని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) ప్రతినిధులు అన్నారు. న్యూ డెమోక్రసీ నేత పైల చంద్రమ్మ వర్ధంతిని పలాస, మందస మండల రట్టి గ్రామంలో వేర్వేరుగా సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు, సాయుధ, గిరి జన, రైతాంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. 17 ఏళ్ల వయసులోనే సాయుధ పోరాట పంథాను ఎంచుకుని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శిగా, రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షు రాలిగా వివిధ హోదాల్లో పనిచేసి సామాన్యుల పక్షాన చివరి వరకు నిలిచిన పైల చంద్రమ్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె ఆశయాన్ని నెరవేర్చేందుకు నిరంతరం పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తీర ప్రాంత, ఉద్దానం గ్రామాల రైతుల ప్రధాన డిమాండ్ అయిన జీడికి గిట్టుబాటు ధర కోసం ఉద్యమించాల్సిన తరుణం ఏర్పడిందన్నారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నేతలు గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, సార జగన్, ఆర్.మాధవరావు, బి.గోపి, మల్లిబాబు, ప్రజా సంఘాల నేతలు జత్తు వీరాస్వామి, రామారావు, కె.సోమేశ్వరరావు, ఎం.వినోద్‌కుమార్, మామిడి భీమారావు, వంకల పాపయ్య, సవర బంగ్లాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో జిల్లా చిన్నారుల ప్రదర్శనలు



బాలవికాస్ పలాస బృందంతో సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు



ఎల్‌ఎన్‌పేట: కోలాట ప్రదర్శన చేస్తున్న శ్యామలాపురం బాలవికాస్ చిన్నారులు

పలాస/ఎల్‌ఎన్‌పేట: సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 21వ పర్తియాత్ర సందర్భంగా జిల్లాకు చెందిన పలు మండలాల బాలవికాస్ చిన్నారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. పలాస సత్యసాయి సేవాసమితి, ఎల్‌ఎన్‌పేట మండలం శ్యామలాపురానికి చెందిన విద్యార్థినులు సోమవారం పుట్టపర్తిలో నిర్వహించిన ఊరేగింపులో కోలాట ప్రదర్శన నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సత్య సాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ.. పర్తియాత్రలో జిల్లాకు చెందిన చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలివ్వడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్ర దాయాలు, కళలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, పలాస మందిర నిర్వాహకులు మల్లా రామేశ్వరరావు, మల్లా శరత్, పెంట కొంతేయుడు, కృష్ణస్వామి, ఎ.నారాయణరావు, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఉషశ్రీ బదిలీ

పోలాకి: ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.ఉషశ్రీని విశాఖపట్నం బదిలీ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం ఇక్కడ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెను వీడ్కోలు పలికి అభినందించారు. ఇదిలా ఉండగా ఎంపీడీవోగా ఎవరినీ నియమించలేదని సీనియర్ అసిస్టెంట్ దేవరావు తెలిపారు.

తిర్లంగిలో ఆక్రమణల తొలగింపు

టెక్కలి: తిర్లంగి గ్రామంలోని ఆక్రమణలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. కాలువపై చేపట్టిన నిర్మాణాలను పోలీసుల సమక్షంలో తీసివేశారు. మూడు రోజుల కిందట ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణ తొలగింపు చేపట్టారు.

కాలం చెల్లిన మందులు అమ్మితే చర్యలు

నరసన్నపేట: తెగుళ్లు, పురుగు మందులు కాలం చెల్లినవి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో సునీత అన్నారు. సోమవారం పట్టణంలో పలు ఎరువుల దుకాణాల్లో పురుగు మందుల శ్యాంపిల్స్‌ను సేకరించారు. ఇటీవల కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు విక్రయించిన పురుగు మందులకు బిల్లులివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం నుంచి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాగులో మెలకువలతో పాటు సాంకేతిక సలహాలను అందించనున్నామన్నారు.

నేటినుంచి 'పొలం పిలుస్తోంది'

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో మంగళవారం నుంచి అక్టోబరు నెలాఖరు వరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేక రులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో రైతులు తెగుళ్ల గుర్తించేందుకు, రసాయనిక, సేంద్రియ ఎరు వుల వాడకం, వివిధ రకాల తెగుళ్ల నివారణలపై సూచనలు సలహాలు అందించనున్నామన్నారు. ఆయా గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైన్స్ ఏడీగా విజయలక్ష్మి

టెక్కలి: టెక్కలి గనులు శాఖ ఏడీగా బి.విజయలక్ష్మిని నియమించారు. ఈమె శాఖ హెడ్‌క్వార్టర్స్ నుంచి టెక్కలి బదిలీపై రాగా, ఇప్పటివరకు పని చేసిన ఏడీ ఫణిభూషణరెడ్డి రాజమండ్రి బదిలీ అయ్యారు. మైన్స్ ఏజీగా కె.రాము విశాఖ నుంచి టెక్కలి బదిలీపై రానున్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నందిగాం: మల్లివీడులో సారాను విక్రయిస్తున్న సవర బాబూరావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. సోమవారం సిబ్బందితో దాడి నిర్వహించగా బాబూరావు ఆరు లీటర్ల సారాను విక్రయిస్తున్నాడన్నారు. సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని నరసన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


ధనుంజయరావు(ఫైల్)

జి.సిగడాం: ఉపాధి కోసం వసల వెళ్లిన యువకుడు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద చాయంలో అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలం ఆనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) గుంటూరులోని ఓ కోల్డ్ స్టోరేజ్ (మిర్చియార్డ్)లో పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ధనుంజరావు.. తిరిగి గుంటూరు వెళ్లేందుకు ఆదివారం ఉదయం చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమంలో నెల్లిమర్ల చెంపావతి వంతెన వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ధనుంజయరావుతోపాటు ఉపాధికి వెళ్తన్న అదే గ్రామానికి చెందిన పోతురాజు నారాయణ రావు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని రోధిస్తున్నారు. ధనుంజయరావుకు భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలు రెండేళ్ల పాప నిచిత, ఆరు నెలల బాబు విరాట్ ఉన్నారు. ఆమదాలవలస జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. అనంతరం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనారోగ్యంతో సీనియర్ కెమెరామన్..


గుణ(ఫైల్)

శ్రీకాకుళం అర్బన్: మీడియా రంగంలో రెండు దశాబ్దాలకు పైగా సేవలందించిన సీనియర్ కెమెరామన్ బూరగాన గురునాథరావు అలియాస్ గుణ (42) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గడిచిన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గుణ రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. మృతదేహాన్ని ఆదివారం పేటలోని అతని స్వగృహానికి తరలించగా.. పలువురు రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు వెళ్లి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు గుణ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి అతడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

లావేరు ఎంఈవో..


ఈశ్వరరావు (ఫైల్)

లావేరు: లావేరు ఎంఈవో లండ ఈశ్వరరావు(48) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన లావేరు మండలంలో సుదీర్ఘకాలం పాటు ఎంఈవోగా సేవలు అందించారు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఐ.తోటయ్యదొరతో పాటు పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అంత్యక్రియలు స్వగ్రామమైన లావేరు పంచాయతీ జీజీ వలసలో నిర్వహించారు.

మదనాపురంలో మహిళ..


పార్వతి(ఫైల్)

బూర్జ: మదనాపురం గ్రామానికి చెందిన ఈపి పార్వతి (58) ఆదివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు, కుమారుడు గణేష్ తెలిపిన వివరాల మేరకు.. పార్వతి కొన్నాళ్లగా మతిస్థిమితం లేక ఇబ్బందిపడుతుంది. ఆదివారం ఉదయం పనులకు వెళ్లిపోయిన కుటుంబ సభ్యులు తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఆమె కనిపించలేదు. దీంతో గణేష్ అన్ని ప్రాంతాల్లో గాలించగా.. గ్రామ శివారున తాగునీటి బావికి దగ్గరలోని రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. పార్వతి తలకు, శరీరంపై తీవ్రంగా గాయాలు ఉండడంతో గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: పట్టణంలోని రైల్వేఎల్‌సీ గేటు సమీపంలో ఒడిశాలోని గంజాం జిల్లా ఖాండూరుకు చెందిన శంకర్ సాహు నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలో సీఐ విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. గుంటూరు ప్రాంతంలో శంకర్ సాహు టైల్స్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన నానితో పరిచయం ఏర్పడింది. ఆయనకు గంజాయి అవసరమైన సమయంలో శంకర్‌సాహు ఒడిశా నుంచి తీసుకువెళ్లే వాడు. కిలో సుమారుగా రూ.ఎనిమిది వేలకు విక్రయిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గస్తీకి వెళ్లిన ఎస్ఐ ఈ.చిన్నంనాయుడు, సిబ్బంది శంకర్ సాహును అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఆయన నుంచి 10 కేజీల 470 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మైనర్లు వాహనాలు నడిపతే నేరం


శ్రీకాకుళం క్రైం: మైనర్లు వాహనాలు నడపటం నేరమని అటువంటి వారు శిక్షార్హులని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ వాహన చట్టాలు, ట్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేని ప్రయాణం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.దేవాదానం, ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.


ఆరు ఇసుక లారీలు పట్టివేత

శ్రీకాకుళం క్రైం: బైరి, కొత్తరోడ్ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను సోమవారం రాత్రి పెద్దపాడు ఎస్ఐ బి.కిషోర్ వర్మ పట్టుకున్నారు. ఈ ఇసుకను విశాఖ తరలిస్తున్నట్టు డ్రైవర్లు చెప్పినట్టు తెలిపారు. ఆ ఆరుగురు డ్రైవర్లపై కేసు నమోదు చేసి లారీలు సీజ్ చేశామన్నారు.

రోడ్డు వేసి ఆదుకోండి

- 'మీకోసం'లో బొండిగూడ గ్రామస్థుల వేడుకోలు


రోడ్డేయాలని కోరుతున్న బొండిగూడ గ్రామస్థులు



బొండిగూడ గ్రామానికి వెళ్లే రహదారి ఇదే

అరసవల్లి: వారంతా అడవి బిడ్డలు. పోడు వ్యవసాయమే వారి జీవనాధారం. చదువుకైనా.. వైద్యానికైనా.. ఏ అవసరం వచ్చినా వారు 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న హిరమండలం లేకుంటే ఎల్ఎన్ పేట రావాల్సిందే. నడవడానికి కూడా అనువుగా లేని కొండజాడల వెంటే వారంతా రాకపోకలు సాగిస్తుంటారు. ఏళ్ల గడుస్తున్నా, ఎన్ని వినతులు అందించిన పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అయినా సరే వారిలో ఆశ చావక సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో తమ గ్రామానికి రోడ్డు వేయాలని కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. హిరమండలం మండలం, మర్రిగూడ పంచాయతీ బొండిగూడ గ్రామస్థుల దయనీయ పరిస్థితి ఇది. ఆ గ్రామంలో 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. అందరం పోడు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడం దురదృష్టకరం. తమ గ్రామం నుంచి కిరిడివలస వరకు గల మూడు కిలోమీటర్ల మేర రోడ్డు వేసినా ఎంతోకొంత ఉపయోగం ఉంటుందని వేడుకుంటున్నారు. కనీసం సైకిల్‌పై వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో తామంతా ఎలా బతకాలని ఆ గ్రామస్థులు ఆవేనద వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఒక్కసారి మా గ్రామాన్ని సందర్శించి కనీస సౌకర్యమైన రోడ్డును వేయాలని వారంతా వేడుకుంటున్నారు.

ఈ చీకట్లు తొలగేదెన్నడో?

- 80 అడుగుల రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు
- నాలుగు రోజులైనా పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు భయపడుతున్న ప్రజలు

అరసవల్లి: నిత్యంరద్దీగా ఉండే 80 అడుగుల రోడ్డులో చీకటిపడితే రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. కలెక్టరేట్‌కు ఈ రోడ్డు మీదుగానే అధికారులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వందలాదిగా వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. పట్టణంలో సుందర్బంగా ఈ రోడ్డును తీర్చిదిద్దామని అధికారులు, నాయ కులు చెబుతుంటారు. కానీ నాలుగు రోజులుగా ఈ రోడ్డులో రాత్రి విద్యుత్ దీపాలు వెలగకపో వడంతో అంధకారంగా మారుతోంది. మిల్లు జంక్షన్ నుంచి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడి ఇంటి వరకు మాత్రమే లైట్లు వెలుగు తున్నాయి. దీంతో చీకటిప డిన తర్వాత ఈ రహదారిపై ప్రయా ణించేందుకు మహిళలు, పాదచారులు, వాహనదారులు భయప డే పరిస్థితి నెలకొంది. తరచూ ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు, మూడు ఘ టనల్లో ప్రాణాలు కూడా కోల్పోయే పరిస్థితులు ఉన్నాయి. ఈ రోడ్డు చీకటిపడితే మందుబాబులకు అడ్డాగా మారుతోంది. గతంలో ఈ రోడ్డులో రాత్రి పూట యువకులు గంజాయి మత్తులో గొడవ లకు దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగావిద్యుత్‌దీపాలు వెలకపోవడంతో ఇక్కడకు విశ్రాంతికోసం వచ్చే వృద్ధులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు విద్యుత్ దీపాలు వెలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


80 అడుగుల రోడ్డులో వెలగని సెంటర్ లైటింగ్

తిరుపతి లడ్డూను అపవిత్రం చేసినవారిని శిక్షించాలి


దీక్షలో కూర్చొన్న జనసేన పార్టీ నాయకులు

శ్రీకాకుళం కల్చరల్/అర్బన్: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని పీఎన్ కాలనీలో గల నారాయణ తిరుమలలోని వేంకటేశ్వరస్వామి సోమవారం దర్శించుకుని ప్రాయశ్చిత్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పవిత్రమైన తిరుమల క్షేత్రంలో జగన్ ప్రభుత్వ హయాంలో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేశారన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, నాయకులు దానేటి శ్రీధర్, పేడాడ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కలెక్టర్, ఎమ్మెల్యేలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అరసవల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అన్ని విభాగాల వైద్యు లతో కార్మికులకు వైద్య సేవలందించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్, శ్రీకాకుళం ఎమ్మె ల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ నెల 25న శ్రీకాకుళానికి కేంద్రం నుంచి బృందం వస్తుందని, స్వచ్ఛతలో అవార్డు వచ్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. డీసీహెచ్ కల్యాణ్‌బాబు, డీఎంహెచ్‌వో బీ.మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, హెల్త్ అధికారి సుధీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: సీజనల్ వ్యాధుల పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం కొండములగాంలో సీహెచ్‌సీలో జరిగిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, గొర్లె లక్ష్మణరావు, డీజీఎం ఆనందరావు, జగన్నాథం నాయుడు, లంక పభకరరావు, వెలిచేటి సురేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరి ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సీహెచ్‌సీ వద్ద స్వచ్ఛత హిసేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు. కాగా మునిసిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో సీసీ రోడ్డు, 21, 22 వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్ శంకుస్థాపన చేశారు.

వీవోఏల బకాయిలు తక్షణమే చెల్లించాలి

అరసవల్లి/శ్రీకాకుళం కలెక్టరేట్: వీవోఏలకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనలను తక్షణమే చెల్లించాలని, అక్రమ తొలగింపులు ఆపాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసంలో డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్‌కు వనతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు డి.జయంతి, అన్నపూర్ణ, శ్రీను, ప్రభావతి, కనకలక్ష్మి, రూపావతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● పనిప్రదేశాల్లో మహిళలకు రక్షణగా ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు శ్రామిక మహిళా జిల్లా కో-కన్వీనర్ అల్లు మహాలక్ష్మి వినతిపత్రం అందజేశారు. ● ఎస్సీఎస్టీ చట్ట ప్రకారం రావాల్సిన పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ గతేడాది అక్టోబరులో హత్యకు గురైన వన్ టౌన్ పరిధిలోని కుమ్మరివీధికి చెందిన దళిత యువకుడు లావేటి గురుమూర్తి భార్య విజయలక్ష్మి కలెక్టర్‌కు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

● **కొత్తూరు:** నిర్వాసితుల ముసుగులో కొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారని మెట్టూరు బిట్-1కు చెందిన బుర్లె శ్రీనివారావు, సవలాపురం బాలరాజు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురండి గ్రామానికి చెందిన బోర డిల్లీశ్వరావు బర్రిపేట గ్రామస్థుడిగా చూపిస్తూ ప్యాకేజీతో పాటు ఇంటి స్థలం అందుకున్నాడని, నిర్వాసితుల ఔట్‌లెట్‌లో రోడ్డును ఆక్రమించికున్నట్టు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడి దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

సబ్జెక్ట్ కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి తాత్కాలిక ప్రాతిపదికన సబ్జెక్ట్ కాంట్రాక్ట్ విధానంలో బోధనకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల్లో పీజీ, యూజీ విభాగాల్లో ఖాళీల భర్తీకి ఈనెల 30న ఉదయం పది గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈలో, ఈఈఈలో మూడు చొప్పున, సివిల్‌లో రెండు, మెకానికల్‌లో ఒక ఖాళీ ఉన్నట్టు తెలిపారు. సైన్స్ కళాశాలలో ఫిజిక్స్‌లో రెండు, మైక్రో బయాలజీలో ఒకటి ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో రూరల్ డెవలప్‌మెంట్, ఎంఎల్ఐఎస్సీ, ఐటెప్, సోషల్‌వర్క్, డీసీఎంఎస్, అనలెటికల్ స్కిల్స్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రయనర్ (మహిళలకు ప్రాధాన్యం)లో ఒక్కక్కటి చొప్పున, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎడ్యుకేషన్/స్పెషల్ ఎడ్యుకేషన్‌లో రెండు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ ఖాళీలను మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపికచేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

టౌన్ ప్లానింగ్ ఏసీపీగా వెంకటేశ్వరరావు

శ్రీకాకుళంక్రైం: గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఏసీపీగా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వరరావును శ్రీకాకుళం టౌన్ ప్లానింగ్ ఏసీపీగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఏసీపీలు పనిచేస్తున్న ఐవీ రమణమూర్తి, వి.వరహాలబాబులకు విజయనగరం, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్‌లో టీపీఎస్‌గా పనిచేస్తున్న కె.మహబూబ్ జాన్‌ను శ్రీకాకుళం టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా నియమించారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం: బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 85 అర్జీలు రాగా, ఎస్పీ బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులకు సంబంధించి పోలీసు అధికారులకు ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు.

మీరే న్యాయం చేయాలి

- ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలి కుటుంబ సభ్యులు

శ్రీకాకుళం క్రైం: ఉద్యోగం పేరుతో మోసపోయి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే మోసం చేసిన వ్యక్తికి సహకరిస్తున్నారంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన 'మీకోసం'లో బాధితురాలి భర్త ఎస్పీని కలిసి జరిగిన సంఘటనను వివరించారు. ఉద్యోగం పేరుతో తన భార్య నుంచి రూ.2లక్షలు వసూలు చేయడంతో పాటు నకిలీ నియామక పత్రాలు అందించిన వరహా నరసింహం, అతడి ఇద్దరి భార్యలతో కలిసి ఈ నెల 18న తన ఇంటికి వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారని, మిగిలిన రూ.రెండు లక్షలు ఇవ్వాలని గొడవపడ్డారన్నారు. దీంతో తన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదును వన్‌టౌన్ పోలీసులు మార్చేసి నామమాత్రంగా కేసు నమోదు చేశారని, మాకు మీరే న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ.. కేసును పూర్తి స్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని సీఐ కె.పైడపునాయుడును ఫోన్‌లో ఆదేశించారు. కాగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని సోమవారం ఉదయం జిల్లా అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్, ఏవో బాబురావు విచారించారు. విధులు నిర్వహించకుండా జీతం ఎలా వేశారని విచారణాధికారులు బాధితురాలిని ప్రశ్నించగా.. జిల్లా వైద్యారోగ్యశాఖలో ఓ రికార్డు అసిస్టెంట్ బుక్ ఏర్పాటు చేసి తనతో సంతకం తీసుకునేదని, అలాగే ఓ వ్యక్తి తనతో థంబింగ్ వేయించేవాడని వివరించినట్టు అధికారులు తెలిపారు. ఈ నివేదికను డీఎంహెచ్‌వో ద్వారా కలెక్టర్‌కు అందించనున్నారు. ఇదిలాఉండగా తాము ఎస్పీని ఆశ్రయిస్తున్నట్టు తెలుసుకున్న సదరు ఇద్దరు వ్యక్తులు.. తన భార్యను బెదిరిస్తున్నారని బాధితురాలి భర్త విలేఖరులకు తెలిపారు. కాగా జిల్లా వైద్యా ఆరోగ్యశాఖలో మాకివలస పీహెచ్‌సీలో కాంట్రాక్టు ప్రాతిపదికన హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుజ్జల వరహా నరసింహులు నగరంలోని ఓ మహిళకు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మించి రూ.2లక్షలు తీసుకుని నకిలీ నియామకపత్రాలు ఇవ్వడంతో పాటు కొన్ని నెలలు జీతం ఆమె ఖాతాలో వేసి మోసం చేసిన ఘటన పాఠకులకు తెలిసిందే. ఈ విషయంలో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా, డీఎంహెచ్‌వో శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.


ఉద్యమాల్లో ఏచూరిది చెరగని ముద్ర

శ్రీకాకుళం స్పోర్ట్స్: కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఏచూరి చెరగని ముద్ర వేసుకున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. శ్రీకాకుళంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకుడు గంగారావు, సింహాచలం, ప్రసాద్, ఈశ్వరమ్మ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య పూజలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వరాలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య పూజలు నిర్వహించారు. ఈశ్వరునికి, సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. నక్క వీధిలో ఉన్న ఉమాజఠశ్వేరాలయంలో అర్చకులు బి.అశ్విని కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


గార: బలరాంపురంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి


ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.రమేష్, తహసీల్దార్ వెంకటరావు, కూటమి నాయకులు దాసరి రాజు, కాళ్ల ధర్మారావు, జాని, నాగరాజుపాత్రో, కాళ్ల దిలీప్ పాల్గొన్నారు.

భరోసా పెరిగింది

గార: రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భవిష్యత్‌పై భరోసా పెరిగిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బలరాంపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు.


అన్ని వర్గాలకు మేలు

ఎచ్చెర్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అన్ని వర్గాలకు మేలు చేసిందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఎచ్చెర్ల, అరిణాం అక్కివలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, పైడి వేణుగోపాలం, బెండు మల్లేశ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల: అరిణాం అక్కివలసలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్..

అల్లినలో..

బూర్జ: వంద రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అల్లెన గ్రామంలో సోమవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు అనెపు రామకృష్ణ, రాంజీ, సత్య ప్రసాద్, జగన్నాథనాయుడు, వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌గో పాల్, ఏవో శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బూర్జ: అల్లెనలో ఎమ్మెల్యే రవికుమార్..

డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణారావు

సోంపేట: సోంపేట డ్రగ్‌ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వజ్జ కృష్ణారావు ఎన్నికయ్యారు. స్థానిక రోటరీ భవనంలో జరిగిన సమావేశం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కేవీ సురేష్, కోశాధికారిగా ఎస్.శ్రీను ఎన్నికయ్యారు. అనంతరం 50 ఏళ్లుగా ఈ ట్రేడ్‌లో ఉన్న సిందిరి కృష్ణారావు, పాండవ రుషికేష్‌ను సన్మానించారు. వైద్యులు పెద్దింటి దుర్యోధన, తుంగాన వెంకటేష్, పి.రమేష్, మంచు ప్రదీప్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎంఎంఎస్ ఎన్నిక

జి.సిగడాం: మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) సభ్యులు ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా సంతవురిటికి చెందిన చిర్రా లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా చంద్రయ్యపేటకు చెందిన కోరాడ వాణిశ్రీ, కోశాధికారిగా జి.సిగడాంకు చెందిన లంక ఉమ, కార్యదర్శిగా ఎందువ గ్రామానికి చెందిన అల్లు గౌరి, ఉప కార్యదర్శిగా గేదెలపేటకు చెందిన లంక జ్యోతి ఎన్నికైనట్టు ఏపీఎం రెడ్డి రామకృష్ణనాయుడు తెలిపారు. వారిచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షులు, సీసీలు, వీవోలు, సిబ్బంది శ్రీదేవి, నాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య నిరోధక కమిటీలు ఏర్పాటు

బూర్జ: అన్ని ప్రభుత్వ జడ్పీ హైస్కూల్, కేజీబీవీ గురుకులం, ఓవీ పేట ఏపీ మోడల్ స్కూల్‌లో పాఠశాలల స్థాయిలో మాదక ద్రవ్య నిరోధక కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీవీ రమణ, హెచ్‌సీ ఎ.ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటక పోటీల్లో ప్రతిభ

రణస్థలం: ఉత్తరాంధ్ర పౌరాణిక నాటక పోటీలు ఆదివారం మన్యం జిల్లా పార్వతీపురంలో లైన్స్‌క్లబ్‌లో జరిగాయి. ఈ పోటీల్లో రణస్థలం గ్రామానికి చెందిన బోనం గురుమూర్తి ప్రదర్శించిన శ్రీకాళహస్తీశ్వర మహాత్యం నాటకంలోని హరిద్వజుడి పాత్రకు ప్రథమ బహుమతి దక్కింది. నగదు, కిరీటంతో గురుమూర్తిని సత్కరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని మొండేటి వీధిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు వన్ టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. వీరి నుంచి రూ.95,110 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పార్టీ బలోపేతాకి కృషి చేద్దాం

ఆమదాలవలస: పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను సోమవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి అభినందించారు. వైసీపీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ఆరంగి మురళీ, ఎల్.రవి, అప్పన్న ఉన్నారు.

అడంగల్ ఇప్పించండి

సోంపేట: అడంగల్, 1బీ ఇప్పించాలని కొర్లాం గ్రామపరిధిలో అగ్రహారం చెరువు ఆయకట్టు రైతులు ఆర్.జానకిరావు, బి.బాలరాజు, ఆర్.బాబూరావు, పి.జోగారావు, ఆర్.అప్పన్న కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అగ్రహారం చెరువు ఆయకట్టులో భూములను ఒడిశా రాష్ట్రానికి చెందిన కృష్ణచంద్ర పాడి తన భూములు ఆక్రమించుకొని సాగుచేస్తున్నారని తహసీల్దార్‌కు గతంలో వినతిపత్రం సమర్పించారు. దీంతో భూములను తహసీల్దార్ లాగిన్‌నుంచి తీసివేశారని రైతులు పేర్కొన్నారు. అయితే ఆ భూములను కొర్లాం, కుమ్మరిపాడు, లక్కవరం గ్రామస్థులు అధికారికంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలు చేసి సాగుచేస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవల ఆ భూములకు సంబంధించి అడంగల్, 1బీలు రావడంలేదని, వెంటనే వీటి రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

కంచిలి: కంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నీరజ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు వివరాలతో హాజరుకావాలని కోరారు.

లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గం

అరసవల్లి: కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లుగా సవరించడం దుర్మార్గమని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు విమర్శిం చారు. సోమవారం స్థానిక పీఎస్ఎన్ఎమ్ హైస్కూల్ వద 44 కార్మిక చట్టాలను లేబర్ కోడ్లుగా మార్చడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు ఎస్.నాగేశ్వరరావు, ప్రభావతి, కనక లక్ష్మి, ఎర్రయ్య, జోగారావు, సూర్యారావు, రూపవతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఏఐటీయూసీ నాయకులు టి.తిరుపతిరావు, కె.అప్పలరాజులు తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, రిమ్స్ అంబులెన్స్, ఆటో, కళాశీ, తదితర రంగాల నుంచి రామకృష్ణ, ఎన్.చంద్రరావు, మహమ్మద్ పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:** శ్యాంపిస్టన్స్ పరిశ్రమ (అరిణాం అక్కివలస) ఆవరణలో 44 కార్మిక చట్టాలను లేబర్ కోడ్లుగా మార్చొద్దని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘ నేతలు ఎస్.శ్రీనివాసరావు, జె.సురేష్, ఎం.సునీల్, ఎల్.నాగరాజు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ మాట్లాడుతూ చట్టాలను లేబర్‌కోడ్లుగా మారిస్తే కార్మికులు బానిసలుగా మారే ప్రమాదముందన్నారు.

జీవో-77 రద్దు చేయాలి

అరసవల్లి: విద్యా దీవెన బకాయిలు రూ.3480కోట్లు తక్షణమే విడుదల చేయాలని, జీవో-77 రద్దు చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జడ్పీకార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ గారితో సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ విధనంలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజు, దుర్గాప్రసాద్, కుసుమ, దియా పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో, ఫెన్సింగ్ పోటీలను సోమవారం ప్రారంభించారు. అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. కార్య క్రమంలో జిల్లా పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను పాల్గొన్నారు.